**సర్వమంగళ మాంగల్యే శివే సర్వార్థ సాధకే! శరణ్యే త్ర్యయంబకే దేవి నారాయణి నమోస్తుతే!!**



# సైకియాట్రిక్ కథలు

## మనసున మనసై

అనూరాధ దగ్గరకు ప్యూన్ వచ్చి ''మేడమ్! మీకు ఫోన్ వచ్చింది. మేనేజరుగారు చెప్పమన్నారు'' అన్నాడు.

అనూరాధ లేచి మేనేజర్ టేబుల్ దగ్గరకు వెళ్లి ఫోన్ తీసుకుంది.

''హాయ్ అనూ! నేనే'' అన్నాడామె భర్త మధుసూదన్.

అనూరాధ మేనేజర్‌వైపు సిగ్గుతో చూసింది. ఆయన ఫైల్లో మునిగిపోయి ఉన్నాడు. ఫర్వాలేదనుకుంటూ ఆమె ''హాయ్ మధూ'' అంది.

''సాయంత్రం ఫస్ట్‌షో సినిమాకి టిక్కెట్లు బుక్ చేశాను. ఏ సినిమాయో సస్పెన్స్. అటునుంచి హాయిగా హోటల్ వెళ్లి భోజనం చేద్దాం. ఆ తర్వాత లలల లలా...''

''ఓకే! నేను అయిదింటికల్లా మా ఆఫీసు గుమ్మంలో వుంటాను''

★★★

సాయంత్రం సినిమా చూసి హోటల్లో భోంచేశాక అనూరాధ వెయిటర్ తెచ్చిన బిల్ చూడబోయింది.

''సంపాదించేది ఎందుకోయ్. లైఫ్ ఎంజాయ్ చేయడానికేగా'' అంటూ మధుసూదన్ ఆమె చేతిలో బిల్ తీసుకుని డబ్బు వెయిటర్‌కిచ్చాడు.

ఆ రోజు ఆనందంగా గడిచిపోయింది.

★★★

ఆదివారం ఉదయం.

''మధూ! ఈ రోజు వంట నీది''

''ఓకే''

''ఇల్లు సర్దడం, బట్టలు ఇస్త్రీ చేయడం నేను చేస్తాను.

రెండేళ్లు అనూరాధ, మధుసూదన్‌లకు హాయిగా గడిచిపోయాయి. అనూరాధ గర్భవతి అయింది. పిల్ల పుట్టాక అనూరాధ ఉద్యోం చేయడమెలా అన్న ప్రశ్న వచ్చింది. ఇటువైపూ, అటువైపూ కూడా పెద్దదిక్కులేదు. పసిపిల్ల దగ్గర గానీ, క్రెష్‌లోగానీ పిల్లను వదలడం ఇద్దరికీ ఇష్టంలేదు. బాబుగానీ, పాపగానీ పుట్టాక అనూరాధ జాబ్ మానేయడమే మంచిదని ఇద్దరూ నిర్ణయించుకున్నారు.

★★★

తమ నిర్ణయంవల్ల వచ్చే చిక్కుల్ని ఇద్దరూ ఊహించలేకపోయారు. బాబు పుట్టాక ఇంట్లో ఖర్చులు ఎక్కువయ్యాయి. అనూరాధ జీతం ఆగిపోవడంతో ఇంటి ఆదాయం తగ్గిపోయింది. మధుసూదన్ సాయంత్రాలు పార్ట్‌టైం కన్సల్టెన్సీ మొదలుపెట్టాడు.

పని ఎక్కువై, విశ్రాంతి, వినోదం పూర్తిగా తక్కువై మధుసూదన్‌లో అలసటా, తర్వాత చికాకూ చోటు చేసుకున్నాయి.

ఇంట్లోనే వుండి ఇరవై నాలుగు గంటలూ పసిపిల్లవాడి సంరక్షణకి అంకితమైపోవడంతో అనూరాధకి అసహనం ఎక్కువైపోయింది. తన చదువు వృధా అయిపోతోందన్న భావం ఆమెను కృంగదీసింది. భర్త అసలు ఇంటి పనిలో కానీ, పిల్లవాడి సంరక్షణలోగానీ సాయపడకపోవడం ఆమెకు అతనిపై కోపం తెప్పించింది.

సాయంత్రం ఇంటికి వచ్చిన మధుసూదన్‌తో అనూరాధ ఏమైనా చెప్పబోతే అతను సగమే వినేవాడు. దాంతో ఆమెకు కోపం వచ్చేది. వచ్చిన అరగంటకే తిరిగి పార్ట్‌టైం పనికి బయలుదేరుతున్న భర్తతో ఆమె ''రాత్రి ఇంటికి వచ్చాక నీ అన్నం నువ్వు పెట్టుకుని తిను. ఇక్కడ పని మనుషులెవరూ లేరు'' అనేది.



మధుసూదన్‌కి ఒళ్లు మండిపోయేది. ''ఈవిడ కోసమూ, ఈవిడ కొడుక్కోసమూ కాదా తను కష్టపడేది. ఏదో సరదాగా తిరుగుతున్నట్లు మాట్లాడుతోందే'' అనుకుంటూ అతను విసురుగా వెళ్లిపోయేవాడు.

''ప్రొద్దున నుంచీ సాయంత్రందాకా ఈయనకీ, ఈయన కొడుక్కీ చాకిరీ చేసి చచ్చిపోతున్నాను. నన్ను పట్టించుకోడేం'' అని అనూరాధ అనుకునేది.

మధుసూదన్ ఇంట్లో వున్నంతసేపూ ఇద్దరూ పోట్లాడుకునేవారు.

స్వర్గంలాంటి ఇల్లు రణరంగంలా మారింది. ఆ విషయం ఇద్దరినీ బాధించింది. ఏం చేయాలో తెలియక ఇద్దరూ మారేజీ కౌన్సిలర్ దగ్గరకు వెళ్లారు.

ఇద్దరూ విడివిడిగా తమ కష్టాలు, జీవిత భాగస్వామి విషయంలో తమకున్న అసంతృప్తి మారేజ్ కౌన్సిలర్‌తో వివరించి చెప్పారు. ఆవిడతో మాట్లాడిన కొద్దీ, ఆవిడ చెప్పినవి విన్నకొద్దీ ఇద్దరికీ తప్పు ఎక్కడ వుందో బాగా తెలిసింది.

బాబు పుట్టడానికి ముందు ఇద్దరి జీవిత విధానాలూ ఒకేలా వుండేవి. ఇద్దరూ ఆఫీసులో పని చేసేవారు. ఇంటి పని పంచుకునేవారు. ఇప్పుడు ఇద్దరి దినచర్యా ఎక్కడా కలయిక లేకుండా వుంది.

మధుసూదన్‌కి ఆలోచించినకొద్దీ అనూరాధ కష్టం అర్థమయింది. రోజంతా ఇంట్లోనే వుండి పసిపిల్లవాడు తప్ప మాట్లాడే దిక్కు లేకుండా ఉండడం చాలా నిస్సారంగా ఉంటుంది. అటువంటి సమయంలో అనూరాధని ఆప్యాయంగా పలకరించి ఆమె చెప్పేవన్నీ విని ఆమెతో కొంతకాలమైనా గడపడం తన బాధ్యత.

అనూరాధకు తను ఎంత గయ్యాళిగా మారిందో తెలిసింది. అలసి ఇంటికి వచ్చిన భర్తతో ''ఇప్పటికి ఇల్లు కనిపించిందా?'' అనడం ఎంత తప్పు! తను సాధించడంవల్లనే అసలు ఇంటికి రాకుండా కన్సల్టెన్సీలో ఎక్కువగా కాంట్రాక్టులు ఒప్పుకుంటున్నాడు. భర్తకి చల్లని నీడలోకి వస్తున్నానన్న భావం కలిగించడం తన ధర్మం.

కౌన్సిలింగ్ పూర్తయ్యేసరికి అనూరాధ, మధుసూదన్‌ల దృక్పథాలు మారిపోయాయి.

''అన్నిటికన్నా కష్టం మాతృత్వం అనే ఉద్యోగం. జీతాలూ, ఇంక్రిమెంట్లూ, ప్రమోషన్లు ఏమీలేని పని. ఎంత కష్టపడి పెంచినా పసిపిల్లలు పని బాగుందని మెచ్చుకోలేరు కూడా'' అన్నాడు మధుసూదన్.

''మా కోసం రాత్రీ, పగలూ కష్టపడుతున్నావు. నీ కిష్టమైన గుత్తి వంకాయ కూర చేశాను'' అంది అనూరాధ.

వారి సంసారం తిరిగి స్వర్గమైంది.

భార్యాభర్తలిద్దరూ కూడా సమస్యలనీ, పరిస్థితుల్నీ తమ జీవిత భాగస్వామి కోణం నుంచి ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. అప్పుడు పోట్లాటలు ఉండవు. స్వయంగా చేసుకోలేనప్పుడు మారేజీ కౌన్సిలర్ల సహాయం తీసుకోవచ్చు.

**-పాలంకి సత్య**